విశాలాంధ్ర

# కథా రచనలో కారా మాస్టర్‌కి సాటి లేరు

## ఘనంగా కాళీపట్నం రామారావు శత జయంతి ఉత్సవ సదస్సులో పలువురు వక్తలు...



విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్ : రైటర్స్ అకాడమీ, సాహిత్య అకాడమీ సంయుక్తంగా ఏర్పాటు చేసిన కథా రచయిత కాళీపట్నం రామారావు శత జయంత్యుత్సవ సదస్సు ఘనంగా నిర్వహించారు. ముందుగా రైటర్స్ అకాడమీ ఛైర్మన్ వి.వి.రమణమూర్తి, విద్యమూర్తి, సి.మృణాళిని, కె.శ్రీనివాసరావు, మస్తాన్‌రెడ్డి తదితరులు కాళీపట్నం రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు సలహా మండలి కన్వీనర్ సి.మృణాళిని అధ్యక్షత వహించిన ఈ సదస్సులో ముందుగా కాళీపట్నం రామారావు మోనోగ్రాఫ్‌ను ఆవిష్కరించారు. డాబా గార్డెన్స్, అల్లూరి విజ్ఞాన కేంద్రంలో శనివారం ఉదయం జరిగిన సదస్సులో సుప్రసిద్ధ రచయిత వి.విమల మూర్తి కీలక ఉపన్యాసం చేస్తూ పతంజలి, హరినాథ్, తనకు కారాతో ఉన్న అనాటి అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కారాకు పల్లెటూరు గ్రామాలు అంటే ఇష్టం అని, వాస్తవిక ప్రపంచం కనిపిస్తుందని అభిప్రాయపడేవారన్నారు. నగరంలోను, పల్లె గ్రామాల్లోను తేడాను కారా మాస్టర్ పరిశీలించే వారని తెలిపారు. కారా దృష్టిలో రుణ భావన, రుణ విధానం తేడాను ఆయన వివరించారు. ఏ వస్తువు ఎవరి దగ్గరికి వచ్చిన అందులో శ్రమ ఉంటుందని రామారావు చెప్పేవారని తెలిపారు. కథా నిలయం, యజ్ఞానికి ఉన్న తేడాను రామారావు విశ్లేషణ చేసేవారన్నారు. సాంప్రదాయిక విధానాలలోని తేడాలను కూడ పరిశీలించి రచనలు చేశారన్నారు. రచయిత బాధ్యతగా ఉండాలని కారా భావించే వారని స్పష్టం చేశారు. సాహిత్య అకాడమీ కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ కాళీపట్నం రామారావు సాహిత్యంలో కథలు, పాటలు, కవితలు అన్నీ ఉంటాయన్నారు. కథా రచయిత కాళీపట్నం రామారావు శత జయంత్యుత్సవ సదస్సులో ఆయన స్వాగతోపన్యాసం చేశారు. కథలు చెప్పడం మానవ చరిత్రలో భాగమని, అదే రామారావు పాటించారన్నారు. విద్యార్థి దశనుండే కథలు రాయడం ప్రారంభించారని గుర్తు చేశారు. కథలు, పాటలు, కవితలు ఈ మూడింటిలో రామారావు ప్రావీణ్యం సాధించారన్నారు. సమకాలీన రచయితలకు ఆయన సుపరిచితులన్నారు. మూఢ నమ్మకాలను ఆసరా చేసుకొని పేదలను ఏ విధంగా దోచుకుంటున్నారో తన రచనలలో వెల్లడించిన వారిలో గురజాడ తర్వాత రామారావు అని చెప్పవచ్చన్నారు. 1970 నాటికి రామారావు సాహిత్యం యజ్ఞం కథ పండితులను, ప్రజలను ఒకే రకంగా ప్రభావితం చేసిందన్నారు. యజ్ఞం కథ సినిమాగా కూడా వచ్చిందని గుర్తుచేశారు. సామాన్య ప్రజల కష్టనష్టాలు గుర్తించి సామాజిక సాహిత్యం ద్వారా సమాజానికి మేలు చేయాలని భావించాలన్నారు. జీవితాంతం వారు ప్రజా ప్రయోజనాల కోసం రచనలు చేశారన్నారు. భారతదేశంలో కథల కోసం కాళీపట్నం రామారావు లాగా ఎవరూ కృషి చేయలేదని కొనియాడారు. యువ రచయితలకు ఆయన ఆదర్శంగా నిలిచారన్నారు. నేటితరం రచయితలు ఆయన ఆదర్శంగా తీసుకొని ప్రజా సంక్షేమం కోసం కథలు రాయడమే ఆయనకు అర్పించే ఘనమైన నివాళి అన్నారు. రచయితగా తెలుగు రచయితలలో బాధ్యత తెలిసిన కథకుడు కాళీపట్నం రామారావు అని తెలుగు సలహా మండలి కన్వీనర్ సి.మృణాళిని తెలిపారు. సదస్సుకు అధ్యక్షత వహించిన ఆమె మాట్లాడుతూ ఎంతోమంది కథలు రాసినవారు ఉన్నారని, కారా మాస్టారు అని పేరు ఆయనకే ఉందన్నారు. పరిశీలన, వ్యక్తిత్వ, సాహిత్యం లోను కారా అధ్యయనం ఉందని నిజమైన అధ్యయన పరుడన్నారు. సమాజంలో జరుగుతున్న పరిణామాలను ఆయన ఎవరు రాయని విధంగా రాసి ప్రభావితం చేశారని కొనియాడారు. ఇటువంటి రచయితలు తెలుగులో చాలా తక్కువ మంది ఉన్నారన్నారు. సమాజంలోని ప్రవృత్తులను ఆయన పాత్రలుగా మలిచారన్నారు. తాజ్ మహల్ అందంగా ఉంటుందా, అనకట్ట అందంగా ఉంటుందా అని అడిగితే, తనకు అనకట్ట ప్రయోజన సౌందర్యం అని కారా అన్నారని తెలిపారు. కొడవటిగంటికి అనకట్ట, రావి శాస్త్రికి తాజ్ మహల్, అనకట్ట రెండు కనిపిస్తాయని పేర్కొన్నారు. నేటితరం విద్యార్థులకు ఆధునిక మాస్టర్ కారా అన్నారు.